సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై కిరణ్, అధికారులు

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై కిరణ్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై మహిళ సాధికారత విభాగంపై డబ్ల్యూఈసీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, ఆగంతకులు చేసే ఫోన్లకు తమ వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు డాక్టర్ వాసవి, డాక్టర్ ప్రమోద్‌కుమార్, డాక్టర్ వరప్రసాద్, సంగీతరాణి, రాంచంద్రం, నీరజ, సుజాత, రహీం, శ్రీలత, జమున, సునీత, జ్యోత్స్న పాల్గొన్నారు.

జగిత్యాల: విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని భరోసా సెంటర్ సభ్యులు సుజాత, షీటీం సభ్యులు కమలాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా మొదట కౌన్సెలింగ్ ఇచ్చి, తర్వాత కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ హరిచరణ్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి


ఎమ్మెల్యేను కలిసిన వెలమ నాయకులు

జగిత్యాల: సంఘం అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన పద్మనాయక వెలమ సంక్షేమ మండలి నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి నూతన కార్యవర్గం నిరవధిక కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ఎల్.రమణలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాగర్‌రావు, కార్యదర్శి వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షుడు దివాకర్‌రావు, కమలాకర్‌రావు, రాజ్యలక్ష్మీ, ప్రశాంత, రవీందర్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

పెగడపల్లి: ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుని సంపూర్ణ స్వచ్ఛత పాటించాలని జిల్లా పశువైద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి మనోహర్ ప్రజలను కోరారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో పలు కుటుంబాలకు చెందిన వ్యక్తిగత మరుగుదొడ్లను అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామాల పారిశుధ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, జీపీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మెప్మా ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మెప్మా ఏవో శ్రీనివాస్ అన్నారు. అఖిల భారత వారోత్సవాలను పురస్కరించుకుని మెప్మా ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార స్ఫూర్తితో మహిళలందరూ పరస్పర సహకారంతో సంఘాలుగా ఏర్పడి విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించారు.కార్యక్రమంలో స్త్రీనిధి రీజినల్ మేనేజర్ భూక్యైలాస్, డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, మమత,సరితతదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరు బీమా చేయించుకోవాలి

జగిత్యాలరూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరు బీమా చేయించుకోవాలని జిల్లా లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ కోట మధుసూదన్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లిలో మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అక్టోబర్ 15 నుంచి జనవరి 15 వరకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు గ్రామస్థాయిలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు గల వారు ఏదైనా బ్యాంక్, పోస్టాఫీసుల్లో బీమా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్ప, వీవోఏ లత,మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీబాయికి నివాళి

జగిత్యాల: స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో ధైర్య సాహసాలతో పోరాటం చేసిన ధైర్యసాహసి ఝాన్సీ లక్ష్మీబాయి అని ఏబీవీపీ నాయకులు అన్నారు. జయంతిని పురస్కరించుకుని నవ్య కళాశాలలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేశ్, ఈశ్వర్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: ఝాన్సీలక్ష్మీబాయి మహిళలందరికీ ఆదర్శమని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేని సునీల్ అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో స్త్రీశక్తి దివస్ ఘనంగా నిర్వహించారు. మహిళా లోకానికంతటికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రాజు, జోనల్ ఇన్‌చార్జి నిఖిల్, సిద్ధు, మణిదీప్, మనోజ్, విద్యార్థులు పాల్గొనారు.

దరఖాస్తులు ఆహ్వానం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో 5,6,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు.ఈ నెల 20,21 వ తేదీల్లో మధ్యాహ్నం 1 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని, 22న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి పరీక్ష రాయడానికి టీజీసెట్–2024 పరీక్ష రాసిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


పెగడపల్లి శివాలయంలో మహిళల పూజలు

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో కార్తీక మాసం పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేక పూజల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్నారు. మంగళవారం రాత్రి స్వామివారికి అభిషేకం జరిపి మహా కాళేశ్వరం శంకరుని రూపంలో అలంకరించారు. సంకష్టమి పురస్కరించుకుని గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

గణపతి ఆలయంలోవిశేష పూజలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల తూములవాడలోని గణపతి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సంకటహరచతుర్థి సందర్భంగా మంగళవారం అర్చనలు,అభిషేకాలు, హోమంతో పాటు తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రి మహాయజ్ఞం


గాయత్రి యజ్ఞంలో భక్తులు

జగిత్యాలటౌన్: హరిద్వార్ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో జగిత్యాల ధరూర్ క్యాంపు కోదండ రామాలయ కల్యాణమంటపంలో మంగళవారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహాయజ్ఞంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సామూహిక యజ్ఞ పూజా క్రతువు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివాజీరావు, సందీప్,గణపతి వైష్ణవ్, శివరాం, పాటిదార్, రాంరెడ్డి, ప్రజ్ఞామండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● యువజన సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలి

జగిత్యాల: యువజన సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ రమణకు 11వ వార్డు మాదిగ యువజన సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంఘ భవనం లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని, మాకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇటీవల ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ మండలాల కార్యవర్గాలను సత్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జువ్వాజి శంకర్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గట్టు సతీశ్, రమణ, ఆనందరావు పాల్గొన్నారు.

● పట్టణాభివృద్ధికి సహకరించాలి

ధర్మపురి: పట్టణ అభివృద్ధిలో ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ధర్మపురికి వచ్చే భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. బస్టాండ్ నుంచి ఆలయం వరకు రోడ్ల కిరువైపులా ఉన్న దుకాణదారులు తమ సామగ్రిని రోడ్లపైకి రాకుండా చూసుకోవాలని, అధికారులు ఏర్పాటు చేసిన మార్కింగ్‌ను దాటి వచ్చిన వారికి జరిమానా విధిస్తామని తెలిపారు. పశువులను రోడ్లపైకి రాకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిచో గోశాలలకు పంపిస్తామని హెచ్చరించారు. ఇంటింటి సమగ్ర సర్వేను ధర్మపురిలో 91.26 శాతం పూర్తి అయిందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, మెప్మా టీఎంసీ జలేందర్ తదితరులున్నారు.

● పబ్లిక్ టాయిలెట్లను వినియోగించుకోవాలి

కోరుట్ల: పట్టణ ప్రజలు, పట్టణానికి వచ్చే పరిసర గ్రామల ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. ప్రపంచ టాయిలెట్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద టాయిలెట్ల వద్ద ఉండే కేర్ టేకర్లను కమిషనర్ సన్మానించారు. కార్యక్రమంలో ఇంచార్జి శానిటరీ ఇనిస్పెక్టర్ అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ తోనెల మహేష్, ఆటో యూనియన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఆధార్ కేంద్రం నిర్వాహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ఆధార్ కేంద్రం నిర్వాహణ విషయంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎంపీపీ నాంపెల్లి లింబాద్రి మంగళవారం తెలిపారు. ఆధార్ కేంద్రం గ్రామపంచాయతీలో నిర్వహించాల్సి ఉండగా.. నిర్వాహకుడు సొంత ఇంటిలో నిర్వహిస్తున్నారని మాజీ ఎంపీపీ లింబాద్రి పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు.

●ముదిరాజ్‌లను బీసీ–ఏ జాబితాలో చేర్చాలి

మెట్‌పల్లి: ముదిరాజ్ కులస్తులను ప్రభుత్వం బీసీ–ఏ జాబితాలో చేర్చాలని సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని ఆర్‌బీ సమావేశ మందిరంలో మంగళవారం ముదిరాజ్ మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో తోకల రాజేశ్వర్, డాక్టర్ ఆనంద్‌బాబు, యామ రాజయ్య, మారంపల్లి శ్రీనివాస్, చిట్యాల లక్ష్మణ్, చేగుంట శ్రీనివాస్, పాతర్ల విజయ్, నేమూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

జగిత్యాలటౌన్: భగవాన్ సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని జగిత్యాల సత్యాసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 200 మంది నిరుపేదలకు చెద్దర్లు, స్వీట్లు, పులిహోర పంపిణీ చేశారు. నవంబర్ 23 భగవాన్ సత్యసాయిబాబా జయంతి సందర్భంగా 5 రోజుల పాటు వివిధ రకాల ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో పూర్వ కన్వీనర్ చిటుమల్ల లక్ష్మీనారాయణ, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

● శివాజీ విగ్రహం ఏర్పాటుకు విరాళం

కథలాపూర్: మండలం పోసానిపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి రూ. 25 వేలు విరాళం మంగళవారం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగారెడ్డి, గాంధారి శ్రీనివాస్, గూడురి గణేశ్ యువకులు పాల్గొన్నారు.

● కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

మెట్‌పల్లిరూరల్: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సత్తా చాటాడు. ఆరో తరగతి విద్యార్థి మణిదీప్ అండర్–14 విభాగం కరాటేలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని హెచ్‌ఎం జితేందర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

●వరికొయ్యలు కాల్చితే భూసారం తగ్గుతుంది

ఇబ్రహీంపట్నం: రైతులు పొలాల్లో వాటి కొయ్యలను కాల్చివేస్తే నేలలో భూసారం తగ్గుతుందని శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వివరించారు. వరికొయ్యలను కాల్చడం వలన వాతావారణంలో కాలుష్యం ఏర్పడుతుందని, అధిక ఉష్ణోగ్రత వలన భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు వినోద్, రవళిక, సాగర్, రైతులు పాల్గొన్నారు.

●21న రాయికల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయికల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి కట్ల నర్సయ్య మంగళవారం తెలిపారు. రేకుర్తి కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు హాజరవుతారని, మండల, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● 21న ఇసుక డంపుల వేలం

ఇబ్రహీంపట్నం: ఇటీవల మండలంలోని కొమటి కొండాపూర్‌లో పట్టుకున్న సుమారు 40 ట్రాక్టర్ల ఇసుక డంపును ఈ నెల 21న మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇసుక వేలం పాటలో పాల్గొనే వారు రూ. 10వేలు దరవాత్ కింద చెల్లించాలని పేర్కొన్నారు.

● గంజాయి పట్టివేత?

ధర్మపురి: పట్టణంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పెద్ద మొత్తంలో గంజాయి పట్టుకున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.గంజాయి విక్రేతలు గత కొంతకాలంగా వివిధ ప్రాంతాల నుండి తెచ్చిన గంజాయిని రహస్యంగా అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా కొందరు యువకులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.గంజాయి పట్టుకున్న విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

సారంగాపూర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలం కొల్వాయిలో చల్ల గంగన్న ఇల్లు కాలిపోగా గంగన్నను, ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించి ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట కొల్వాయి సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాష్, నాయకులు ఉన్నారు.

ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి

సారంగాపూర్: ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు నిర్భయంగా తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదగా వ్యవహరించాలని, సమస్య పరిష్కరిస్తామని వచ్చిన వారికి ధైర్యం కల్పించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను పనితీరుపై సమీక్షించారు. ఆయన వెంట సీఐ కృష్ణారెడ్డి, సారంగాపూర్, బీర్‌పూర్ ఎస్సైలు దత్తాద్రి, కుమారస్వామి, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి సహస్ర కవిత స్ఫూర్తి అవార్డు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కవిత సహస్ర కవిత స్ఫూర్తి అవార్డును అందుకున్నారు. రోజుకు ఒక కవిత చొప్పున వెయ్యి కవితలు పూర్తి చేసి, ప్రతిభను చాటినందుకు ఉదయ సహితి సంస్థ హుస్నాబాద్ వారు నిర్వహిస్తున్న నేటి కవిత వాట్సాప్ సమితి సమూహంలో సంస్థ నిర్వాహకులు రచయిత దాస్యం సేనాధిపతి, దాస్యం లక్ష్మయ్య, అవార్డును ఆన్‌లైన్ ద్వారా అందచేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కవితనుపలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి సద్భావన పురస్కారాలు

మల్లాపూర్: మండలకేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త రుద్ర రాంప్రసాద్, సీనియర్ ఫొటోగ్రాఫర్ దురిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రస్థాయి సద్భావన సేవా పురస్కార్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందిరాగాంధీ జయతోత్సవాల్లో భాగంగా ప్రవంతి నృత్య కళానికేతన్, సృజన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక సేవా, ఫొటోగ్రఫీ కార్యక్రమాల విభాగంలో సద్భావనా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రవంతి నృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె మారుతి బాపూజీ, గౌరవ అధ్యక్షుడు కోటగిరి వెంకటస్వామి, సృజన వెల్ఫేర్ సైటీ వ్యవస్థాపక అధ్యక్షులు అందె భవిత రాణి, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుడికి..

కథలాపూర్: మండలంలోని తాండ్య్రాల గ్రామానికి చెందిన సూక్ష్మ వస్తువుల హస్త కళాకారుడు బండెడ్ల విష్ణు అనే యువకుడు రాష్ట్రస్థాయి సద్భావన పురస్కారం అందుకున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి రోజున కళాకారులకు సద్భావన పురస్కారాలు అందజేస్తున్నట్లు ప్రవంతి నృత్య కళానికేతన్ సేవాసంస్థ ప్రతినిధులు తెలిపారు. దీంతో విష్ణుకు పురస్కారం అందించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె మారుతి తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు మరో ఉద్యమం


మాట్లాడుతున్న నాయకులు

సారంగాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగలు, మాదిగ ఉపకులాలు సిద్ధం కావాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల ఎమ్మార్పీఎస్ కమిటీని ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల సాయిలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సుద్దాల తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా పూదారి రవి, అధికార ప్రతినిధిగా గజ్జెల మహేశ్, మండల ప్రధాన కార్యదర్శిగా నారపాక ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులుగా నారపాక ప్రశాంత్, నక్క రామయ్య, తాటిపల్లి దుబ్బయ్య, మండల కార్యదర్శిగా నారపాక శంకర్, సుద్దాల రమేశ్, ప్రచార కార్యదర్శిగా మంద మహేష్, కార్యవర్గ సభ్యులుగా కొత్త నాగరాజు, చందాల వెంకటి నియమితులయ్యారు.



ధర్మపురి: పట్టణంలోని తోట్లవాడ ప్రధాన రహదారిలో డ్రైయినేజీ ధ్వంసమై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వాడలోని ప్రధాన మూలమలుపు వద్ద గల మురుగుకాల్వ పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనాలు మలుపు తిరిగేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి.అలాగే మురుగు పేరుకు పోతూ దుర్గంధం వస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి ఫోన్ నంబర్: 8886649051

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643


కోరుట్ల, ధర్మపురిలో ఇందిరా గాంధీకి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మెట్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు


కోరుట్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

కోరుట్ల/ మెట్‌పల్లి/ధర్మపురి/రాయికల్/మల్లాపూర్/ పెగడపల్లి/వెల్గటూర్/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/సారంగాపూర్: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్ర పటానికి, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు.కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పేదరిక నిర్మూలనకు 20 సూత్రాల పథకాన్ని ప్రవేశ పెట్టి దేశ ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందని కొనియాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


రాయికల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

రాయికల్: సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో మధుసూదన్ సూచించారు. మంగళవారం రాయికల్ పట్టణంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సర్వేలో పొందుపర్చిన అంశాలకు ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి వివరాలు సేకరించాలన్నారు. వాటి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం అల్లీపూర్, అయోధ్యలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, ఎంపీవో సుష్మ ఉన్నారు.

317 జీవో బాధితులకు అండగా ఉంటా


మాట్లాడుతున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

జగిత్యాల: 317 జీవో బాధితులకు అండగా ఉంటానని, టెట్ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం ఉచిత యాప్ ఏర్పాటు చేస్తానని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఆశిస్తున్న నరేందర్‌రెడ్డి మంగళవారం పలు పాఠశాలల్లో మాట్లాడారు. విద్యావేత్తగా తాను ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలను గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. తనకు అవకాశం ఇస్తే 317 జీవో బాధితులకు అండగా ఉండి, పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు పార్టీకి పూర్వ వైభవం తేవాలి

సారంగాపూర్: బీఆర్ఎస్ పార్టీకి నూతన కార్యవర్గ సభ్యులు పూర్వవైభవం తీసుకురావాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు నూతనంగా ఎన్నికైన పార్టీ అధ్యక్ష, కార్యదర్శులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నుంచి గెలిచి కొంత మంది వెళ్లిపోయినా పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, దీనిపై ప్రజల కోసం ప్రభుత్వాన్ని నిలదీసి, వాటిని అమలు చేసేలా చూడాల్సిన బాధ్యత మనమే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సారంగాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తేలు రాజు, అనంతుల గంగారెడ్డి, బీర్‌పూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అయిల్నేని ఆనందరావు, నేరెల్ల సుమన్, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సొసైటీ మాజీ చైర్మన్ సాగి సత్యం రావు, నాయకులు పాల్గొన్నారు.